A

అడల్ట్స్ ఓన్లీ కథ!

# విషపురుషుడు

ఈమని కోటేశ్వరరావ్

గాలిని వాన పెనవేసుకుందో, వానని గాలి పెనవేసుకుందో తెలియని విధంగా ఎడతెరిపిలేని గాలీవానా.

చిమ్మచీకటిలో జరుగుతున్న ఈ చోద్యాన్ని లోకానికి బట్టబయలు చేయడానికన్నట్టుగా మధ్యలో మెరుపులు. అప్పుడప్పుడూ ఉరుములు.

ప్రకృతి బీభత్సంలో చిక్కుకుపోయాడు నరేంద్ర.

డ్యూటీ ముగించుకుని త్వరగా గూటికి చేరదామనుకుని మిగతా సిబ్బంది వారించినా వినకుండా బయలుదేరిన ఫలితంగా- ఇప్పుడు ఇలా గాలివానలో, నట్టడవిలో, గాఢాంధకారంలో, చెడిపోయిన జీపులో చెట్టుకింద బిక్కుబిక్కుమంటున్నాడు.

ఏ పురుగో పుట్రో కుట్టినా మందిచ్చే నాధుడు లేడు. ఏజెన్సీ ఏరియా. కాళ్లకింద ఏ మందుపాతరుందో? పెనుగాలికి ఏ మ్రానైనా విరిగి మీద పడుతుందేమో? ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని, చేతుల్ని చంకల్లో పెట్టుకుని ఒణుకుతూ ఒగరుస్తూ క్షణాల్ని యుగాలుగా గడుపుతున్నాడు.

మెరుపుల వెలుగు తప్పించి అంతా గాఢాంధకారమే.

టార్చ్ వేసి టైం చూసుకున్నాడు.

ఒకటింబావు.

చలి ఒంటిని కొరుకుతోంది.

కునుకు తీద్దామని ఎంత ప్రయత్నించినా వీలు కావడం లేదు నరేంద్రకు. అయినా బలవంతంగా కళ్లు మూసుకున్నాడు.

ఎంత సమయం అలా గడిచిందో తెలియదు గానీ 'టక్... టక్' మన్న జీపును కొట్టిన శబ్దంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.



మెరుపుల వెలుగులో ఓ స్త్రీ.

టార్చ్ వేశాడు.

చేతుల్ని కళ్లకి అడ్డం పెట్టుకుంటూ అడిగింది-

''రామాపురం ఎల్తదా?''

''వెళ్తుంది, ఎక్కు'' అన్నాడు నరేంద్ర.

మెదడులోని విషనాడులు స్పందించడానికి అరక్షణం చాలు. తను వెళ్తుంది రామాపురం కాదు. అయినా ఠక్కున అబద్ధం చెప్పేశాడు.

గాఢాంధకారంలో, కారడవిలో ఒక తోడు కావాలి.

అదీ మిసమిసలాడే వయసున్న ఆడదైతే అంతకంటే ఇంకేం కావాలి?

ఎక్కి- జీపులో కూర్చుంది ఆమె.

తడిసిముద్దయిన ముద్ద మందారంలా వుంది. రెండు పదులు మించని వయసు. కట్టూ, బొట్టూ చూస్తే గిరిజన స్త్రీలా వుంది. తడిసిన బట్టలు ఒంటి వంపుల్ని ఆరబె

డుతున్నాయి.

చలికి వణుకుతూ రెండు చేతుల్ని గుండెలకదుముకుని ఒరిగిపోయి కూర్చుంది.

''ఇంత రాత్రివేళ ఈ వర్షంలో ఎక్కడికి బయలుదేరావ్?'' అడిగాడు నరేంద్ర.

''మా అయ్యకి సుస్తీ చేసింది. దవాఖాన్లో జేర్పించినం. రామాపురంలో మా అన్న ఉన్నాడు. ఆడికి కబురు సెప్పిరమ్మన్నాడు మా అయ్య. ఆకరి బస్సు కోసం జూసిన. రాల. ఇట్ల ఇరుక్కుపోయిన'' గద్గదమైన స్వరంతో చెప్పింది.

''ఈ జీపు కూడా చెడిపోయింది. వర్షం తగ్గాక చూస్తాను బాగవుతుందేమో''

''నేనెల్లాల'' దిగబోయింది.

''ఆగాగు. ఒక్క గంటలో వర్షం ఆగిపోవచ్చేమో. ఒక్కడినే ఈ నట్టడవిలో ఉండాలంటే నాకు భయంగా ఉంది. వర్షం తగ్గిన తర్వాత జీపు బాగుచేసి నిన్ను ఎక్కడకు చేర్చమంటే అక్కడకు చేరుస్తాను'' అన్నాడు అర్థింపుగా.

అంతటి గాలివానలో అందునా అంధకారంలో ఒక మనిషిని నిర్దయగా వదిలిపెట్టి వెళ్లాలనిపించ లేదు ఆమెకు. అలానే కూర్చుండిపోయింది.

''నీ పేరు?'' సిగరెట్ వెలిగిస్తూ అడిగాడు.

''సుక్క''

పేరుకు తగిన రూపు. చక్కని చుక్క.

వెచ్చని పొగ ఊపిరితిత్తుల్ని చేరి కొత్త ఊపిరినిచ్చినట్టయింది నరేంద్రకు.

''వెనక సీట్లో కూర్చో. పడుకున్నా పరవాలేదు. వర్షం తగ్గాక లేపుతాను''

సరేననలేదు, కాదనలేదు. అలానే ముడుచుకుపోయి కూర్చుంది.

ఇంతకు ముందున్న ఆలోచనా ధోరణికి భిన్నంగా ఉంది ఇప్పుడు నరేంద్రకు. ఇంతకు ముందు... అసహనం, చికాకు, భయం, నిస్సత్తువ వగైరా. ఇప్పుడు? ఉత్సాహం, ఉత్తేజం, ధైర్యం, వెయ్యి ఏనుగుల బలం వగైరా. అప్పుడూ ఇప్పుడూ అదే వాతావరణం... మార్పు లేదు. మార్పల్లా ఒకటే...

చుక్క.

దబ్బపండులాంటి పిల్ల ఇలాంటి వాతావరణంలో, అరడుగు దగ్గరకు వచ్చి చేరిందంటే... స్పందించవా నవనాడులు?

''వెనక్కు వెళ్లమన్నానా?'' ఈసారి గద్దించినట్టుగా అన్నాడు.

ఉలిక్కిపడింది చుక్క. అతను ఎందుకు అంతగా అరిచాడో అర్థం కాలేదు. వెనక్కి వెళ్లటానికన్నట్టు జీపులోంచి దిగబోయింది.

''దిగక్కరలేదు. లోపలి నుంచే వెనక్కి దాటు'' అన్నాడు.

ముందు సీటులోంచి ఒక్క అంగలో వెనకసీటుకి చేరింది.

వెనక సీటులోకి అడుగుపెట్టేటప్పుడు ఒక్కసారిగా రివ్వున విసిరిన గాలికి ఆమె లంగా ఛట్ మంటూ నరేంద్ర ముఖాన్ని తాకింది.

లోలోపల రగులుతున్న అగ్నికి అది ఆజ్యమో, విషమో తెలీదుగానీ తోడయింది. ఆమె వంటిలోని వెచ్చదనం వస్త్రం వాహకంగా అతని ముఖాన్ని స్పృశించింది.

వెనక సీటులో ముడుచుకుని పడుకుంది.

వర్షం ఇప్పట్లో తగ్గని సూచనలుగా ఉరుములు, మెరుపులు.

''ఇంత వర్షంలో ఏ మృగమో వచ్చి మీదపడే అవకాశం ఉందా చుక్కా?''

''లేదు సామీ. ఆటికీ బయ్యమే. మడిసుంటే సచ్చేటంత బయ్యం.''

చుక్క మాటలకు నరేంద్ర నవ్వాడు. ''నీ బొంద. వాటికి భయమేమిటి? అమాంతం మీదపడి పీక్కుతినే క్రూరమృగానికి మనిషంటే భయమా? ఉత్త అమాయకురాలిలా ఉన్నావే''

''సత్తె పెమానకం మీద సెప్తున్నా సామీ. అయ్యా బతకాలిగా! ఆకలయితేనే ఇంకో జెంతువు జోలికెల్లద్ది. నేకుంటే పురుగ్గూడా ముట్టదు''

చుక్కతో ఏవో నాలుగు మాటలు కలపటానికన్నట్టు మాట పెంచాడు కానీ నిజానికి నరేంద్రకు అది అసందర్భ ప్రస్తావనే.

## ఎందుకో మరి!

**అంత్రామాలి-వివేక్ ఓబెరాయ్‌కి ఒకరంటే ఒకరికి అస్సలు గిట్టదట. ఇద్దరూ కలిసి 'రోడ్' సినిమాలో నటించారు. మరి పడనప్పుడు ఎలా కలిసి నటించారు? అనే డౌటు వస్తుంది కదా! ఆ సినిమా రామ్‌గోపాల్‌వర్మది కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నటించారుట. సీన్‌కి సంబంధించి మాత్రమే మాట్లాడి ఆ తర్వాత ఎడమొహం పెడమొహమేనట. అసలు ఇద్దరికీ ఏం గొడవ వచ్చి ఇలా పడడనేది బాలీవుడ్‌లో జనాలకి పజిల్‌లా వుందిట.**



''బ్యాటరీ అయిపోయేట్టుగా వుంది'' అంటూ టార్చ్ ఆఫ్ చేశాడు.

కొన్ని క్షణాలు గడిచాయి.

అప్పుడప్పుడు మోగుతున్న చుక్క కాలి గజ్జెల చప్పుడు మెల్లమెల్లగా ఆగిపోయింది. చుక్క నిద్రలోకి జారుకుందనటానికి గుర్తుగా.

మనసులో పట్టిన ముసురు మాత్రం నరేంద్రకు కునుకు తీయనీయటం లేదు. అంతరంగంలో పుడుతున్న ఒక్కొక్క ఆలోచనా తరంగం అతన్ని ఉవ్వెత్తుకు తీసుకెళుతోంది.

అధికారిక హోదా, సంఘంలో గౌరవప్రదమైన జీవితం, ఏ లోటూ లేని సంసారిక శృంగార జీవితం... ఇవన్నీ ఉన్న తననే ప్రక్కనున్న ఒక స్త్రీ ఈ వాతావరణంలో, ఈ నిర్జన ప్రదేశంలో ఉక్కిరిబిక్కిరి చేస్తుందంటే...

కేవలం అవయవాల పొందిక వల్ల తప్పించి నాగరిక ప్రపంచం ఒక మనిషిగా గుర్తించని శీలభంగం జరిగినా వీసమెత్తయినా గౌరవభంగం కాని జాతిలో పుట్టిన ఈ కొండజాతి పిల్లను ప్రక్కనో పురుషుడు మాత్రమే ఉన్నప్పుడు రకరకాల ఊహలు ఈమెను ఊపెయ్యవా?

''చుక్కా?'' మంద్రంగా పిలిచాడు.

ఉలుకూ, పలుకూ లేదు.

'ఎందుకై వుంటుంది?' తన్నుతాను ప్రశ్నించుకున్నాడు. ఓహో! ఏ జాతైనా ఆడజాతే కదా! సిగ్గూ, బిడియం సహజం అనుకున్నాడు.

ఆలోచించేకొద్దీ అంతరంగంలోని ఆకృతి మెల్ల మెల్లగా ఓ రూపు దిద్దుకుంటోంది. మోహనాకారమో, రాక్షసాకారమో పరిపూర్ణంగా రూపుదాల్చింది.

ఒక్క ఉదుటున వెనక్కి చేరాడు.

చుక్క కదల్లేదు. ఒప్పుకున్నట్టా? నిద్రలో ఉన్నట్టా? క్షణం సంధిగ్ధంలో పడ్డాడు.

టార్చ్ వేశాడు. చుక్క భంగిమ ఉక్కిరిబిక్కిరి చేసింది నరేంద్రను.

లంగా పిక్కలపై వరకు తొలిగి వుంది. అక్కడ పరచుకున్న వెలుగు టార్చ్ నుంచి వస్తోందా అరటి బోదెల్లాంటి చుక్క పిక్కల్లోంచి వస్తోందా అన్న సందేహం. ఎద సంపద మోయలేక రవిక ఇప్పుడో, ఇంకాసేపటికో పిట్లుతానన్నట్టుగా వుంది.

నిద్రపోతోందా, నటిస్తోందా?

తదేకంగా ఒక్క క్షణం అలానే చూస్తుండిపోయాడు. అలా చూసిన ఆ క్షణం గడచిన మరుక్షణంలోనే ఒక్కటే నిర్ణయానికొచ్చాడు. ఇంకొక్క క్షణం కూడా వ్యర్థం చేయకూడదని.

బలమైన అతని చెయ్యి ఆమె నడుం మీద పడింది. ఉలిక్కిపడి లేవబోయిన చుక్క భుజంపై రెండో చెయ్యి పడింది.

గట్టిగా విదిలించబోయిన ఆమె కాలు అప్రయత్నంగా అతని నడుముని చుట్టేసింది. పెనుగులాటలో ఇద్దరూ సీటు పై నుంచి కిందకు దొర్లారు. హఠాత్తుగా దొర్లటం వల్ల వారికి తెలియకుండానే రెండోసారి దొర్లి ఆగిపోయారు. అడుగున ఆమె, పైన నరేంద్ర. చుక్క రెండు కాళ్ల మధ్య నరేంద్ర నడుం ఇరుక్కుపోయింది.

అంతే.

నట్టడవిలో, జడివానలో, విసురుతున్న గాలి హోరులో, ఉరుముల పెనుమోతలో, ఆమె రోదన అతనికి ప్రణయనాదంలా వినిపిస్తోంది.

అతనికి ప్రణయం ఆమెకు ప్రళయం. అతని పెనువేటలో ఆమె పెనుగులాట ఓటమి చెందింది.

వివశురాలైంది... ఎదిరించే అస్త్రాలేమీ లేక అతడి వశమైంది శవంలా ఆమె. నర్తిస్తున్న నాగులా ఆమెపై అతడు. క్షణాలు స్తంభించాయి.

విషం చిమ్మిన తృప్తితో అతను లేచి సీటుపై కూర్చున్నాడు.

విషం కమ్మిన వ్యధతో ఆమె అచేతనంగా ఉండిపోయింది.

గాలి వానని వదిలేసింది.

క్రమంగా వాన తగ్గుముఖం పట్టింది.

టైం చూశాడు నరేంద్ర.

నాలుగున్నరవుతోంది. ఇంకో గంటకో, గంటన్నరకో తెల్లారుతుంది.

చుక్కవైపు టార్చ్ వేశాడు. చటుక్కున లేచి కూర్చుంది. వంటిమీద ఉండాల్సిన బట్టలు మూలకు చేరాయి. సిగ్గుతో మోకాళ్లను గుండెలకదుముకుని రెండు చేతుల్నీ కాళ్లకు చుట్టుకుని కూర్చుంది. తలను మోకాళ్లపై ఉంచి లీలగా రోదిస్తోంది.

''బట్టలు కట్టుకో'' అంటూ బట్టల్ని ఆమెపై వేశాడు. ఏడుస్తూనే బట్టలు కట్టుకుంది. లేచి సీటుపై కూర్చుంది. ఏడుపు క్రమంగా పెరుగుతోంది.

''ఛ..ఛ.. ఎందుకేడుస్తావ్? నేను మాత్రం మనిషిని కానా? నీకు అన్యాయం చేస్తానా? నాకా మాత్రం జ్ఞానం లేదనుకున్నావా?'' అంటూ ప్యాంటు జేబులోంచి పర్స్ తీశాడు.

తలెత్తి చూసింది.

ఒక్కసారి అతణ్ణి తీక్షణంగా చూసింది.

అంత వేదనలోనూ ఓపిక కూడదీసుకుంది. బలంగా అతని చొక్కా పట్టుకుని ముందుకు గుంజింది.

ఈ హఠాత్పరిణామం నుంచి నరేంద్ర తేరుకునే లోపే రెండు కాళ్లతో గట్టిగా అతని గుండెలపై తన్నింది. యధాలాపంగా కూర్చుని ఉన్న నరేంద్ర వెనుక డోరుపై పడ్డాడు.

క్షణాల్లో తేరుకుని లేచి కూర్చోబోయేంతలో మళ్లీ కాళ్లతో తన్నింది. రెప్పపాటులో నరేంద్ర జీపులో నుంచి కింద పడ్డాడు.

పడీపడడంతోనే ''అమ్మా'' అంటూ కేక వేశాడు.

చుక్క కంగారుపడింది అతని కేకకి. ఏ రాయి మీదో పడి అతని తల పగిలిందేమో అనుకుని జీపులో నరేంద్ర చేతిలోంచి జారి పడిన టార్చ్‌తో కిందకు చూసింది.

కాలి మడమని రెండు చేతుల్తో పట్టుకుని కింద పడి మెలికలు తిరిగిపోతున్నాడు.

పదడుగుల దూరంలో గడ్డిపరకల కదలికలు గమనించి టార్చ్ అటువైపు తిప్పింది. పరిశీలనగా చూసింది.

ఒళ్లు జలదరించింది చుక్కకు.

దాదాపు నాలుగడుగులు పొడవున్న త్రాచు. సర్రున పాక్కుంటూ పొదలోకి దూరిపోయింది.

ఒక్క అంగలో జీపులోనుంచి కిందకు దూకింది. క్షణం ఆలస్యం చేయలేదు. రవిక విప్పదీసింది. నరేంద్ర పట్టుకున్న కాలిమడమ పై భాగంలో గట్టిగా బిగించి కట్టింది.

''అమ్మా... అమ్మా...'' అంటూ మెలికలు తిరిగిపోతున్నాడు నరేంద్ర.

కాలుని రెండు చేతుల్తో పట్టుకుంది. మడమపై గాటుని గుర్తించి నోటితో గట్టిగా కొరికి రక్తాన్ని పీల్చింది. రక్తంతోపాటు విషాన్ని కూడా పీల్చి ఉమ్మేసింది.

పాముకాటుకి, పంటిగాట్లకి ఓర్చుకోలేక విదిలించికొడుతున్న నరేంద్ర కాళ్లు చుక్క గుండెల్ని తంతున్నా లెక్కచేయక విషాన్ని పూర్తిగా పీల్చి ఉమ్మేసింది.

టార్చ్ తీసుకుని అక్కడే ఉన్న పొదల్ని వెదికింది. ఏవో ఆకుల్ని చేతుల్తోనే నలిపి నరేంద్ర కాలి మడమపై గాటు ఉన్న చోట పెట్టింది. కాసేపు అలానే ఒత్తి పట్టుకుంది.

కొంతసేపటికి మగత వదిలింది నరేంద్రకు. మెల్లగా కళ్లు తెరిచాడు. చేత్తో అదిమిపట్టి కాలుని వళ్లో పెట్టుకుని కూర్చున్న చుక్క కనపడింది. ఓపిక కూడదీసుకుని లేచి కూర్చున్నాడు.

తన వంటి మీద ఉన్న జెర్కిన్ తీసి చుక్కకు ఇచ్చాడు. అప్పటివరకూ ఆచ్ఛాదన లేకుండా ఉన్న ఎదని కప్పుకుంది.

చుక్కే కనుక రక్షించకపోతే తను పాముకాటుకి బలైపోయేవాడు. విషప్పురుగు తనలోకి చిమ్మిన విషాన్ని బయటకు లాగేసింది చుక్క.

మరి తను చుక్క జీవితంలో చిమ్మిన విషానికి విరుగుడు ఏమిటి?

విషప్పురుగు కాటుకి విరుగుడు ఉంది. మరి విషప్పురుషుడి కాటుకి?

నవనాడులూ కృంగిపోతున్నట్టుగా ఉంది నరేంద్రకు.

తలను ఏ రాయికో బాదుకోవాలనిపిస్తోంది.

నిజంగానే నరేంద్ర తలను రాయికేసి బాదుకున్నా చుక్కకు ఒరిగేదేమిటి? ☆

